క్లుప్తంగా

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



కురవి: మండలంలోని గుండ్రాతిమడుగు(విలేజి) గ్రామంలో గిరిజన సంక్షేమ శాఖ(ఐటీడీఏ) ద్వారా పీఎంఏజీవై నిధుల నుంచి మంజూరైన రూ.5లక్షల విలువైన సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆదివారం జెడ్పీటీసీ బండి వెంకటరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ జంగిలి హరిప్రసాద్, వార్డు సభ్యులు రాంబాబు, భవానిఉపేందర్, జాఫర్‌ఖాన్, రాజు, బావ్‌సింగ్, నాయకులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం




మహబూబాబాద్ అర్బన్: మానుకోట జిల్లా కేంద్రంలోని రామకృష్ణ హై స్కూల్ 1993–94 పదో తరగతికి చెందిన బ్యాచ్ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించుకున్నారు. అనంతరం పాఠశాల కరస్పాండెంట్ దేవేందర్, హెచ్‌ఎం మహేందర్‌ను సన్మానించి సత్కరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సుభాని, చరణ్, శ్రీనివాస్, ఊర్మిళ ముస్తఫా అనుపమ, లక్ష్మి, మమతా, కావ్య, మహేష్, బాలు, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరా పునరుద్ధరణ

మహబూబాబాద్: మానుకోట మున్సిపాలిటీ పరిధిలోని బీసీ కాలనీలో ఈనెల 21న వర్షానికి చెట్లు కూలి విద్యుత్ స్తంభాలపై పడ్డాయి. దీంతో నాలుగు విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. వార్డు కౌన్సిలర్ హరిసింగ్ మూడు రోజులుగా అక్కడే ఉంటూ పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయించారు. కాగా ఎట్టకేలకు ఈనెల 23 మధ్యాహ్నం విద్యుత్ సరఫరా ఇచ్చారు.

వర్షానికి కూలిన గోడ



గార్ల: వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు గార్లలోని కొలిమికొట్టం బజారుకు చెందిన కండ్రాతి అన్నపూర్ణ ఇంట్లో నిద్రిస్తుండగా ఇంటిగోడ ఒక్కసారిగా కూలిపోయింది. అన్నపూర్ణ మాత్రం ప్రాణాపాయం నుంచి బయటపడింది. నిరుపేద అయిన అన్నపూర్ణను ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

గ్రామాల్లో పీరీల సందడి





కురవి: సీరోలు, కురవి మండలాల్లోని వివిధ గ్రామాల్లో పీరీల సందడి నెలకొంది. ఆదివారం సీరోలు మండలం కొత్తూరు (సీ) గ్రామ శివారు గుజిలి తండాలో అయ్యగారిపల్లి గ్రామానికి చెందిన భక్తులు పీరీలతో ఊరేగింపు వచ్చి ఇంటింటికి తిరిగారు.

మరిపెడ: మరిపెడలో పీరీల ఊరేగింపు సందడి నెలకొంది. మొహరం పండుగను పురస్కరించుకొని పీరీలను మండల కేంద్రంలో భక్తులు ఊరేగించారు.

చిన్నగూడూరు: మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల్లో పీరీల సందడి నెలకొంది. ఆదివారం మండల కేంద్రంలో వాడవాడన ఊరేగింపు నిర్వహించారు. మహిళలు పీరీలకు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.

మంత్రి బంధువు మృతి



కురవి: రాష్ట్ర గిరిజన, స్త్రీ శిశు సంక్షేమ శాఖల మంత్రి సత్యవతిరాథోడ్ బంధువు గుగులోత్ వాలి(65) ఆదివారం మృతి చెందారు. కురవి మండలంలోని గుండ్రాతిమడుగు(విలేజి) శివారు పెద్దతండా గ్రామంలో గుగులోత్ వాలి మృతి చెందిన విషయం తెలిసిన వెంటనే మంత్రి సత్యవతిరాథోడ్ హుటాహుటిన హైదరాబాద్ నుంచి పెద్ద తండాకు చేరుకున్నారు. మృత దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. భావోద్వేగానికి గురై కన్నీరుమున్నీరుగా విలపించారు. ఆమె వెంట జెడ్పీ చైర్‌పర్సన్ అంగోత్ బిందు, బయ్యారం పీఏసీఎస్ చైర్మన్ మూలమధూకర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు.

డిజిటల్ బోధన ప్రారంభం

- తరగతి గదుల్లో అమర్చిన టీవీలు
- డిజిటల్ బోధనతో బహుళ ప్రయోజనాలు

డోర్నకల్: మన ఊరు–మన బడి కార్యక్రమంలో ఎంపికైన ప్రభుత్వ హైస్కూళ్లలో డిజిటల్ బోధన ప్రారంభమైంది. డోర్నకల్, కన్నెగుండ్ల జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలల్లో మూడు చొప్పున టీవీలను అమర్చి ఇటీవల 8, 9, 10 తరగతులకు ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్(ఐఎఫ్‌పీ) డిజిటల్ బోధన ప్రారంభించారు. టీ-షాట్ ద్వారా ప్రసారమయ్యే డిజిటల్ పాఠాలను తరగతి గదులలో ఉపాధ్యాయులు బోధించనున్నారు.



టీవీలో ప్రసారమైన డిజిటల్ పాఠాలను బోధిస్తున్న ఉపాధ్యాయురాలు

బహుళ ప్రయోజనాలు..

డిజిటల్ బోధన కోసం తరగతి గదుల్లో అమర్చిన టీవీల ద్వారా విద్యార్థులకు బహుళ ప్రయోజనాలు చేకూరనున్నాయి. టీవీ స్క్రీన్‌పై డిజిటల్ పాఠాలు ప్రసారమైనపుడు నేరుగా బోధించడం, టీవీ స్క్రీన్‌పై మార్కర్‌తో రాస్తూ పాఠాలను బోధించడం, టచ్ స్క్రీన్ కావడంతో పాఠ్యాంశాన్ని మొత్తం ఒకేసారి స్క్రీన్ జరుపుతూ రాయడం లాంటి వెసులుబాటు ఉంది. ఇంటర్ నెట్, యూట్యూబ్ అంశాలతోపాటు ఇతర సమాచారాన్ని పూర్తిస్థాయిలో విద్యార్థులకు బోధించే అవకాశాలు ఉన్నాయి. పాఠ్యపుస్తకాలలో ముద్రించిన క్యూఆర్ కోడ్‌ను స్క్రీన్ ద్వారా స్కాన్ చేసి సంబంధించి పాఠ్యాంశాల పూర్తి సమాచారాన్ని డౌన్‌లోడ్ చేసి బోధించవచ్చు. డిజిటల్ పాఠాల బోధన ద్వారా మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా విద్యార్థుల మేధాశక్తి పెరగడంతో పాటు అభ్యసనాశక్తి మెరుగుపడుతుందని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

డిజిటల్ బోధన బాగుంది..



మా పాఠశాలలో ప్రారంభించిన డిజిటల్ బోధన బాగుంది. టీవీల ద్వారా ప్రసారమవుతున్న పాఠాలు, స్క్రీన్‌పై మార్కర్‌తో రాస్తూ బోధిస్తుండటంతో తేలికగా అర్థమవుతోంది. - గిరిధర్, 8వ తరగతి విద్యార్థి

పేద విద్యార్థులకు చేయూత

మహబూబాబాద్ అర్బన్: పేద విద్యార్థులకు చేయూత అందించడంలో కిషన్ పరివార్ స్వచ్ఛంద సంస్థ ఎప్పుడు ముందుంటుందని సంస్థ చైర్మన్ భూపాల్ నాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పీఎస్‌ఆర్ కన్వెన్షన్ హాల్లో ఆదివారం సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు బస్సు పాస్ పంపిణీ కార్యక్రమానికి భూపాల్‌నాయక్ హాజరై మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాల చదువుకునే పేద పిల్లలకు సంస్థ అన్ని విధాలుగా సహకారం అందిస్తుందన్నారు. డీఎస్పీ సత్యనారాయణ మాట్లాడారు. తల్లిదండ్రులకు, కళాశాల అధ్యాపకు పేరు ప్రఖ్యాతలు తీసుకు రావాలన్నారు. అనంతరం పాట్నా ఐఐటీలో సీటు సాధించిన విద్యార్థికి రూ.10వేలను అందజేశారు.



ఆర్టీసీ అధికారులకు చెక్కు అందజేస్తున్న భూపాల్ నాయక్, డీఎస్పీ సత్యనారాయణ

అనంతరం ఆర్టీసీ అధికారులకు రూ.6లక్షల విలువ చేసే ఉచిత బస్‌పాస్‌ల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ రీజినల్ మేనేజర్ శ్రీలత, ఆర్టీసీ డిపో మేనేజర్ విజయ్ పాల్గొన్నారు.

మేరు సంఘం మండల అధ్యక్షుడిగా గణేష్

బయ్యారం: మేరు సంఘం మండల అధ్యక్షుడిగా గట్ల గణేష్‌ను ఎన్నుకున్నారు. ఆదివారం బయ్యారంలో నిర్వహించిన సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా వెన్ను వేణు, ఉపాధ్యక్షుడిగా రామనాథం, నరేష్, మోహన్, వెంకటేశ్వర్లు, రామనర్సయ్యతోపాటు పలువురు సభ్యులను ఎన్నుకున్నారు.

నివాళి

గార్ల: స్వాతంత్య్ర సమరయోధురాలు కెప్టెన్ లక్ష్మి సెహగల్ సేవలు మరువలేమని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు కందునూరి కవిత అన్నారు. ఆమె వర్ధంతి సందర్భంగా స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో అలువాల సత్యవతి, తాళ్లపల్లి రమ, కందునూరి సుజాత, సంగు ఉమ, నాగమణి, కమల, స్వరూప, తదితరులు పాల్గొన్నారు.

దళితులందరికీ 'దళితబంధు' ఇవ్వాలి



నిరసన తెలుపుతున్న సంఘాల నాయకులు

నెహ్రూసెంటర్: అర్హులైన దళితులందరికీ దళితబంధు ఇవ్వాలని దళిత సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దళితబంధు పథకం రెండో విడత ప్రారంభించి పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్‌సెంటర్‌లో ఆదివారం నిరసన తెలిపారు. ఈసందర్భంగా డీహెచ్‌పీఎస్ జాతీయ సమితి సభ్యులు నర్ర శ్రావణ్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుడ్డెల రామ్మూర్తి, టీఎస్ ఎంఆర్‌పీఎస్ నాయకులు సోమారపు వీరస్వామి, ఎంహెచ్‌డీ జిల్లా అధ్యక్షుడు హెచ్.వెంకటేష్, కొత్తపల్లి కిషోర్‌కుమార్, కుర్ర మహేష్ మాట్లాడారు. కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం జిల్లా కార్యదర్శి నీరుడి సామేల్, కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా నాయకులు పాల్గొన్నారు.

బ్రాహ్మణుల సంక్షేమానికి కృషి చేయాలి

తొర్రూరు: బ్రాహ్మణుల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని బ్రాహ్మణ సేవా సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంగు నవీన్‌శర్మ, బ్రాహ్మణ అఫిషియల్స్, ప్రొఫెషనల్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వింజమూరి సుధాకర్ అన్నారు. కరీంనగర్ జిల్లా హుజురాబాద్‌లో జరిగే బ్రాహ్మణ ఆత్మీయ శంఖారావం సభకు ఆదివారం తొర్రూరు నుంచి బ్రాహ్మణ నాయకులు తరలివెళ్లారు. అంతకుముందు నిర్వహించిన సమావేశంలో నవీన్‌శర్మ, సుధాకర్‌లు మాట్లాడుతూ.. గ్రామాల్లో పౌరహిత్యం చేస్తున్న బ్రాహ్మణులకు 60ఏళ్లు నిండిన తర్వాత పెన్షన్ అందించాలన్నారు. విదేశాలకు వెళ్లే బ్రాహ్మణులకు రుణ సదుపాయం కల్పించాలన్నారు. కార్యక్రమంలో పాలకుర్తి దేవస్థాన చైర్మన్ వెనకదాసుల రామచంద్రయ్యశర్మ, బ్రాహ్మణ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు కొల్లావఝల రమేష్‌శర్మ, ప్రతినిధులు అన్నావఝల రాంబాబు, కృష్ణమోహన్, రామాచార్యులు, రాజేశ్వర్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.



సభ కరపత్రాలు చూపుతున్న బ్రాహ్మణ నాయకులు

అన్నివర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే రెడ్యానాయక్

చిన్నగూడూరు: అన్నివర్గాల సంక్షేమమే ధ్యేయంగా కేసీఆర్ ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే రెడ్యా నాయక్ అన్నారు. మండలంలోని తానంచర్ల గ్రామ శివారు వాల్యతండాకు చెందిన కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు తేజావత్ సురేష్ నాయక్‌తోపాటు మరికొందరు మండలంలోని ఉగ్గంపల్లిలో ఆదివారం ఎమ్మెల్యే రెడ్యా సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రెడ్యా మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పలు పార్టీల నాయకులు, కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా మైనారిటీ నాయకులు ఆయూబ్‌పాషా, బీఆర్‌ఎస్ నాయకులు నరేష్, శంకర్ తదితరులు ఉన్నారు.

కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం



కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నాయకులు

కేసముద్రం: దివ్యాంగులకు పెన్షన్‌ను మరో వెయ్యికి పెంచడంపై ట్ల హర్షిస్తూ ఆదివవారం మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు గుగులోతు వీరునాయక్ ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ వోలంచంద్రమోహన్ మాట్లాడుతూ.. దేశంలోనే ఎక్కడాలేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నేత నీలం దుర్గేష్, ముత్యాల శివకుమార్, ఆగె వెంకన్న, నర్సింగం వెంకటేశ్వర్లు, శ్రీను, సుధాకర్, బాలునాయక్, వెంకన్న పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌ను ఓడించాలి

బయ్యారం: పలు వాగ్దానాలతో అధికారంలోకి వచ్చి హామీలు అమలు చేయని బీఆర్‌ఎస్‌ను రానున్న ఎన్నికల్లో ఓడించాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకులు రవి, గుండెబోయిన నాగమణి ప్రజలను కోరారు. మండలంలోని అల్లిగూడెం, కాచనపల్లి గ్రామాల్లో ఆదివారం వారు వేర్వేరుగా గడపగడపకు కాంగ్రెస్ కార్యక్రమం నిర్వహించారు.

అక్రమ వ్యాపారాలకు పాల్పడితే చర్యలు

గూడూరు: గ్రామాల్లో అనుమతిలేకుండా వాహనాలు కల్గి ఉన్నా, అక్రమ వ్యాపారాలకు పాల్పడినా పట్టుబడిన వారిపై కఠిన చర్యలు తప్పవని గూడూరు ఎస్సై బి. రాణాప్రతాప్ అన్నారు. మండలంలోని పాటిమీదితండా, లక్ష్మీపురం గ్రామాల్లో ఆదివారం గూడూరు పోలీసుల ఆధ్వర్యంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈసందర్భంగా పోలీసులు ఇంటింటినీ సోదా చేశారు. అక్రమంగా పట్టుబడిన వాటిని సీజ్ చేశారు. మద్యం సీసాలు, 5క్వింటాళ్ల నల్లబెల్లం, 15కిలోల పటిక, 35లీటర్ల గుడుంబా, సరైన పత్రాలు లేకుండా ఉన్న ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నారు. 2వేల లీటర్ల బెల్లం పానకం అక్కడే ధ్వంసం చేశారు. కార్యక్రమంలో ముగ్గురు ఎస్సైలు, ఏఎస్సైలు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.



పట్టుబడిన మద్యం సీసాలు చూపుతున్న పోలీసులు

గుంతలమయమైతే పట్టింపు లేదా..!

- మాజీ కేంద్ర మంత్రి బలరాం నాయక్

నెల్లికుదురు: నేను కేంద్ర మంత్రిగా ఉన్నప్పుడు మంజూరు చేస్తే వేసిన రోడ్లు గుంతల మయమైతే పట్టించుకునే వారు కరువయ్యారు. మళ్లీ ఎమ్మెల్యేగా వచ్చి నేనే రోడ్లు వేయాల్సిన దుస్థితి బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో నెలకొందని మాజీ కేంద్ర మంత్రి పోరిక బలరాం నాయక్ బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై మండిపడ్డారు. తొర్రూర్ నుంచి మహబూబాబాద్‌కు వెళ్లే ప్రధాన రహదారిపై మండల కేంద్రంలో గుంతలమయంగా మారి నీరు నిలిచిన బురదలో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా ఇక్కడి ప్రజాప్రతినిధులుకు ఎవ్వరికి పట్టింపులేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బురదతో నాట్లు వేసి నిరసన తెలిపారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ రావడం ఖాయం అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు యాదవరెడ్డి, మండల అధ్యక్షుడు గొల్లపల్లి ప్రభాకర్, నాయకులు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



నాటు వేసి నిరసన తెలుపుతున్న బలరాం నాయక్

కొత్త మెనూకు బడ్జెట్ కేటాయించాలి



మాట్లాడుతున్న కుంట ఉపేందర్

నెహ్రూసెంటర్: పెరిగిన ధరలతో మధ్యాహ్న భోజన కార్మికులు ఆర్థికంగా అవస్థలు పడుతున్నారని, ప్రభుత్వం కొత్త మెనూ ప్రకారం భోజనం పెట్టాలని ఒత్తిడి చేస్తున్నందున కొత్త మెనూకు బడ్జెట్ కేటాయించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్ అన్నారు. మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్ జిల్లా విస్తృతస్థాయి సమావేశం ఆదివారం సంఘ కార్యాలయంలో నిర్వహించారు. ఈసందర్భంగా కుంట ఉపేందర్ మాట్లాడుతూ.. కొత్త మెనూకు బడ్జెట్ కేటాయించే వరకు పాత మెనూనే కొనసాగిస్తామని తెలిపారు. సీఐటీయూ ఆధ్వర్యంలో పోరాటాల ఫలితంగానే మధ్యాహ్న భోజన కార్మికుల వేతనాలు పెంచారన్నారు. సమావేశంలో యూనియన్ జిల్లా అధ్యక్షురాలు వేముల రుజన్య, జిల్లా కార్యదర్శి ఆర్.ధనలక్ష్మి, నాయకులు సుజాత, మమత, యాకమ్మ పాల్గొన్నారు.

కొనసాగుతున్న జీపీ కార్మికుల సమ్మె

గూడూరు: సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేపట్టిన గ్రామపంచాయతీ సిబ్బంది, ఉద్యోగులు ఆదివారం మౌనం పాటించారు. ఈసందర్భంగా సంఘం నాయకులు తమ కోర్కెలు నెరవేర్చి ఉద్యోగ భద్రత కల్పించాలని, వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణ, మోహినోద్దీన్, ఐలయ్య, రాజు, వెంకన్న, సంతోష్ పాల్గొన్నారు.

చెవిలో పూలతో నిరసన

కేసముద్రం: కేసముద్రం, ఇనుగుర్తి మండల కేంద్రాల్లో ఆదివారం జీపీ కార్మికులు చెవిలో పూలు పెట్టుకుని నిరసన దీక్ష చేపట్టారు. ఈసందర్భంగా సంఘాల అధ్యక్షులు జాటోతు మంగీలాల్, రాములు మాటాడారు.

బయ్యారం: పంచాయతీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఇఫ్టూ జిల్లా ప్రధాన కార్యదర్శి సివారపు శ్రీధర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బయ్యారం బస్టాండ్ సెంటర్‌లో పంచాయతీ కార్మికులు నిర్వహిస్తున్న సమ్మెను ఆదివారం సందర్శించి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో ఏఐకెఎంఎస్, పీడీఎస్‌యూ నాయకులు వెంకటయ్య, దేవేందర్, శ్రీశైలం, మధు పాల్గొన్నారు.

తొర్రూరు: గ్రామ పంచాయతీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి రవి అన్నారు. పంచాయతీ కార్మికుల సమస్యలపై డివిజన్ కేంద్రంలో చేపట్టిన దీక్షా శిబిరాన్ని ఆదివారం ఐఎఫ్‌టీయూ, బీఎస్పీ, మాదిగ ఉద్యోగుల సమాఖ్య నాయకులు సందర్శించి సంఘీభావం తెలిపారు.



గూడూరు: నిరసన తెలుపుతున్న జీపీ సిబ్బంది



బయ్యారం: మాట్లాడుతున్న శ్రీధర్



కేసముద్రంలో..



తొర్రూరులో..

పేకాట శిబిరంపై దాడి

డోర్నకల్: డోర్నకల్ మున్సిపాలిటీ పరిధిలోని సిగ్నల్‌తండాలో పేకాట శిబిరంపై ఆదివారం రాత్రి డోర్నకల్ పోలీసులు దాడులు నిర్వహించారు. సీఐ ఉపేందర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్సై రవికుమార్ ఆధ్వర్యంలో సిగ్నల్‌తండాలో పేకాట శిబిరంపై దాడి జరపగా ఇద్దరు వ్యక్తులు పట్టుబడగా కొంతమంది వ్యక్తులు పారిపోయినట్లు తెలిపారు. ఇద్దరు వ్యక్తుల నుంచి రూ.16వేలు స్వాధీనపర్చుకుని కేసు నమోదు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

గుడుంబా స్థావరాలపై పోలీసుల దాడి

చిన్నగూడూరు: మండలంలోని పగిడిపల్లి గ్రామ పరిధిలోని బావోజీ తండా శివారులో ఆదివారం చిన్నగూడూరు పోలీసులు గుడుంబా స్థావరాలపై దాడి చేశారు. స్థానిక ఎస్సై సంతోష్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పగిడిపల్లి గ్రామ శివారు బావోజీ తండా పరిసర ప్రాంతంలో నర్సింహులపేట మండలం బొడ్డి తండాకు చెందిన మాలోత్ వెంకన్న (లచ్చు) గుడుంబా తయారు చేస్తుండగా దాడి చేశామన్నారు. అతని వద్ద నుంచి 15 లీటర్ల గుడుంబాను స్వాధీన పరుచుకుని స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. గుడుంబా తయారీకి పాల్పడిన వెంకన్నపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఈ దాడిలో పోలీస్ సిబ్బంది సోమన్న, మోహన్ తదితరులు ఉన్నారు.

మణిపూర్ దోషులను కఠినంగా శిక్షించాలి



డోర్నకల్: ధర్నా నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

డోర్నకల్: మణిపూర్‌లో గిరిజన మహిళలపై మారణకాండను నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో ఆదివారం గాంధీ సెంటర్‌లో ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు శెట్టి వెంకన్న, కందునూరి శ్రీనివాస్, నాయకులు శ్రీనివాస్, వెంకన్న, మల్లేశం, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

మరిపెడ: మణిపూర్‌లో మహిళలను నగ్నంగా ఊరేగించిన దోషులను కఠినంగా శిక్షించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బానాల రాజన్న డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బిక్షం, నాగన్న, బూపాల్ పాల్గొన్నారు.

కేసముద్రం: మణిపూర్ ఘటన కారకులను కఠినంగా శిక్షించాలని అంబేడ్కర్ యువజన సంఘం మండల అధ్యక్షుడు వల్లందాసు రవి డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శ్రీరాములు, కృష్ణమూర్తి, నాగరాజు, యాకయ్య పాల్గొన్నారు. మణిపూర్ ఘటనలో దోషులను కఠినంగా శిక్షించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కంటిపుడి అరుణ్‌కుమార్, తెలంగాణ అంబేడ్కర్ సంఘం మండల అధ్యక్షుడు వేల్పుగొండ ఏలియా అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో జరిగిన సంఘాల సమావేశంలో వారు మాట్లాడారు. మణిపూర్ ఘటనకు కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. నాయకులు సాయిబాబా, వెంకన్న, బిక్షపతి, శ్రీనివాస్ పాల్గొన్నారు. అత్యాచారాలు, హత్యలను అరికట్టాలని, దోషులను కఠినంగా శిక్షించాలని ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు బొమ్మనబోయిన అనసూర్య ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటాం



పెద్దవంగర: పార్టీ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పెదగాని సోమయ్య అన్నారు. మండలంలోని గంట్లకుంట గ్రామానికి చెందిన బీజేపీ సీనియర్ నేత గడపురం బిక్షపతి ఇటీవల మరణించగా బాధిత కుటుంబ సభ్యులకు పార్టీ తరపున సమకూర్చిన రూ.30వేలు అందజేశారు. బీజేపీ రాష్ట్ర నాయకులు పాకనాటి దామోదర్‌రెడ్డి, లేగా రామ్మోహన్‌రెడ్డిలతో కలిసి సోమయ్య మాట్లాడారు. ప్రలోభాలకు గురి కాకుండా బీజేపీ పార్టీలోనే కడదాక నిలిచిన క్రమశిక్షణ గల కార్యకర్త బిక్షపతి అని కొనియాడారు. ఆసియాలోనే అత్యంత పెద్ద పార్టీ బీజేపీ అని, పార్టీ అధికారంలోకి వచ్చే వరకు కార్యకర్తలు శ్రమించాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ పూసాల శ్రీమాన్, నాయకులు సుంకరనేని కోటేశ్వరరావు, రంగు రాములుగౌడ్ పాల్గొన్నారు.